ఆంధ్రజ్యోతి
సవ్య
కుటుంబ కదంబం
17-2-2011 • గురువారం

వరల్డ్‌కప్ టీ షర్ట్ ₹ 7000

మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న వరల్డ్‌కప్‌ను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే చాలా వస్తువులు మార్కెట్‌లోకి వచ్చాయి. వీటి జాబితాలో ఇప్పుడు మరొకటి చేరింది. టీ షర్టు. ఫిఫా(ఫుట్‌బాల్) వరల్డ్‌కప్ దుస్తులను డిజైన్ చేసిన పాల్‌స్మిత్ మూడు నెలలు కష్టపడి ఈ టీషర్టును రూపొందించారట. ఉపఖండంలో జరుగుతున్న వరల్డ్‌కప్‌ను దృష్టిలో పెట్టుకొనే ఈ బ్రిటిష్ డిజైనర్ దీనిని డిజైన్ చేశాడు. భారత్‌లో వున్న క్రికెట్ ప్రేమికులందరినీ ఆకట్టుకునేలా మూడు రంగులను మిళితం చేసాడు. అవి భారత జాతీయపతాకంలోని రంగులను పోలివుంటాయి. దీంతో పాటు టీ షర్టుపై మన జాతీయపతాకం ముద్రించి వుంటుంది. ముందుభాగంలో దూకుతున్న సింహం బొమ్మ కనిపిస్తుంది. ఇలాంటి డిజైన్ జాతీయభావాన్ని రేకెత్తించడానికి దోహదపడుతుందని స్మిత్ అభిప్రాయపడుతున్నాడు. 2011 వరల్డ్‌కప్‌కు ఇదొక థీమ్ టీషర్టు అవుతుందని కూడా స్మిత్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు. వరల్డ్‌కప్ మ్యాచ్‌లు జరిగే నగరాల్లో వీటిని విడుదల చేశాడు. మ్యాచ్‌లు అదురుతాయో లేదో కాని ఈ టీషర్ట్ ధర మాత్రం అదుర్సే...7000రూ.

• సలహా

సదా మీ సేవలో

ఆకాశంలో సగం' అంటూ పొగుడుతారు కానీ.. నేల మీద జరిగే హింసలో ఆమె వాటా ముప్పాతికకు పైనే. బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు అడుగడుగునా స్త్రీకి ఎన్నో సమస్యలు, ఆటంకాలు. కాలేజీకి వెళ్లే వయసులో ర్యాగింగ్, ప్రేమ పేరిట మానసిక హింస, పెళ్లయ్యాక గృహహింస, వృద్ధాప్యంలో పిల్లల నిరాదరణ.. ఇవన్నీ కూడా మనసుకు గాయం చేసేవే. ఇలా మనసు గాయపడినప్పుడు.. వైఫల్యాలు కుంగదీసినప్పుడు.. అసంతృప్తులు కమ్ముకున్నప్పుడు మౌనంగా ఉండిపోతే.. సమస్యల ఊబిలో కూరుకుపోతాం. ఇలా జరగకూడదని భావిస్తే.. మనసు విప్పాలి.. ఒకరి బాధను మరొకరు పంచుకోవాలి. ఈ భావననే అనుసరిస్తూ ఆపన్నులకు అండగా నిలుస్తోంది.. సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని 'సేవ'. 'సమస్య ఏదైనా సరే.. మా కేంద్రానికి రండి. వ్యక్తిగతంగా రాలేకపోతే ఫోన్ ద్వారా సంప్రదించండి. మీ సమస్య ఏదైనా సరే ఓపికగా వింటాం. తోచిన పరిష్కారాలు చెబుతాం. మీ వివరాల గోప్యత.. మా బాధ్యత' అంటోంది 'సేవ'.

సంధ్య(పేరు మార్చాం)కు ఓ అన్న, తమ్ముడు, మానసిక స్థితి సరిగా లేని ఒక చెల్లి ఉన్నారు. నాన్నకు చిన్న బట్టల దుకాణం ఉంది. కానీ అతడు తాగుడుకు బానిస. రోజూ తాగొచ్చి తల్లితో గొడవపడటం, చితకబాదటం మామూలైపోయింది. పెళ్లీడుకొచ్చిన పిల్లలున్నారన్న జ్ఞానం కూడా లేకుండా భర్త ప్రవర్తిస్తుండటంతో భరించలేక ఓ రోజు సంధ్య తల్లి తన ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. భార్య మరణంతో సంధ్య తండ్రి కూడా ఎటో వెళ్లిపోయాడు. తల్లిదండ్రులను కోల్పోయిన కుటుంబానికి అన్న పెద్ద దిక్కుగా ఉంటాడని, తండ్రి తాలూకు బట్టల దుకాణాన్ని అతడు తన భుజస్కంధాలపై వేసుకుంటాడని సంధ్య భావించింది. కానీ ఆ అన్న పెళ్లి చేసుకుని తన దారి తాను చూసుకున్నాడు. ఇక్కడే ఉంటే తమ్ముడ్ని, చెల్లెళ్లను చూడాల్సి వస్తుందేమోనని మరో ఊరు వెళ్లిపోయాడు. ఈ పరిస్థితులు చూసి తీవ్ర మానసిక వేదనకు గురైన ఆమె తమ్ముడు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడు. ఇదంతా ఒక పార్శ్వమైతే.. మరోవైపు తనను ఇష్టపడుతున్న వ్యక్తి. సంధ్య కోసమే పెళ్లి చేసుకోకుండా పదేళ్లుగా ఎదురు చూస్తున్నాడు. కుటుంబ 'బంధాలను' తెంచుకుని రాగలిగితే రమ్మన్నారు అతడి తల్లిదండ్రులు. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో సంధ్యకు అర్థం కావడం లేదు. చెల్లిని, తమ్ముడ్ని వదిలేసి అన్న బాటలోనే తానూ నడవాలా? లేక మానసిక స్థితి సరిగా లేని చెల్లిని, తమ్ముడిని పోషించడం కోసం తానే సర్వస్వం అనుకుని నిరీక్షిస్తున్న ప్రియుడికి దగ్గర కావాలా? ఏం చేయాలి?

✦ ✦ ✦

జ్యోతి(పేరు మారింది)ది మరో కథ. డిగ్రీ చదువుతున్న వయసులో ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డ వ్యక్తిని నమ్మి ఇంట్లోంచి డబ్బు, నగానట్రా తీసుకుని అతడే తన జీవిత సర్వస్వం అనుకుని ఇల్లు విడిచి వచ్చేసింది. ఇద్దరూ ఓ గుడిలో దండలు మార్చుకుని భార్యాభర్తలయ్యారు. ఓ చిన్న ఇల్లు అద్దెకు తీసుకుని కాపురం పెట్టారు. సంసారానికి అవసరమైన అన్ని వస్తువులు సమకూర్చుకున్నారు. రెండ్రోజులు బాగానే గడిచాయి. మూడో రోజు ఏదైనా ఉద్యోగం చూసుకుని వస్తానని చెప్పి వెళ్లిన భర్త ఆ తరువాత ఇంటికి తిరిగి రాలేదు. వారం, పది, నెల రోజులు గడిచిపోయినా అతడి జాడ లేదు. ఈలోగా 'నీ భర్త మా దగ్గర అప్పులు చేశాడు.. వాటి కింద ఈ సామాను జమకట్టుకుంటాం..' అంటూ కొందరు వచ్చి ఇంట్లో ఉన్న సామాను మొత్తం ఎత్తుకుపోయారు. అప్పుడుగాని అతడి చేతిలో తాను మోసపోయానని ఆమెకు అర్థం కాలేదు. తనకున్న చదువుతో ఏదో చిన్న ఆఫీసులో ఉద్యోగం సంపాదించుకుంది. అక్కడ మరో వ్యక్తి ఆమెకు పరిచయమయ్యాడు. కొన్నాళ్లకు ఆ పరిచయం ప్రేమగా మారింది. 'ఎలాగూ పెళ్లి చేసుకోబోతున్నాం కదా..' అంటూ అతడు ఆమెను లొంగదీసుకున్నాడు. 'ఊరెళ్లి అమ్మానాన్నలకు అన్నీ వివరించి వారిని తీసుకొస్తానని.. రాగానే జరిగేది పెళ్లే..' అంటూ నమ్మించి ఒకరోజు అతగాడు వెళ్లిపోయాడు. మళ్లీ మోసం. అలా వెళ్లిన అతడు ఎప్పటికీ తిరిగి రాలేదు. ఈ పరిస్థితుల్లో జ్యోతి ఏం చేయాలి? ఆమె బాధను పంచుకునే వారెవరు?

✦ ✦ ✦

ఆవిర్భావం ఇలా..

మనసును బాధించే విషయాలు ఎవరితోనైనా పంచుకునే వెసులుబాటు ప్రతి ఒక్కరికీ ఉండాలి. ఈ ఆలోచనతోనే శారదా గోపాలకృష్ణన్ 'సేవ' స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. ఢిల్లీలోని 'సంజీవిని' అనే ఓ స్వచ్ఛంద సంస్థలో శారద సభ్యురాలు. అక్కడ మానసిక సమస్యలతో బాధపడే వారికి కౌన్సెలింగ్ అందిస్తారు. ఆమె భర్త ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కి బదిలీ అవడంతో ఇక్కడే స్థిరపడ్డారు. జంటనగరాలలో ఇలాంటి కౌన్సెలింగ్ సెంటర్ లేకపోవడం గమనించిన శారద తన మనసులో ఉన్న ఆశయాలకు ఒక రూపమిచ్చారు. అన్ని రకాల మానసిక సమస్యలను విని, సూచనలందించే సంస్థను ఆరంభించాలనుకున్నారు. పదిహేడేళ్ల క్రితం అంటే.. 1993లో 'సేవ' చిన్న సేవా కేంద్రంగా ఆరంభమైంది. మొదట్లో ఇక్కడికొచ్చే వారి సంఖ్య తక్కువే. ఎవరైనా చూస్తే.. ఎవరికైనా తెలిస్తే.. ఏమనుకుంటారో అనే భయంతో చాలామంది కౌన్సెలింగ్ సెంటర్‌కు రావడానికి భయపడుతున్నారని తెలిసి ఫోన్ ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చే కార్యక్రమాన్ని 'సేవ' సభ్యులు ప్రారంభించారు. ఈ ఆలోచన ఫలించింది.

సమస్యల 'ట్రెండ్'..

నేటి సమాజంలో సమస్యలు ఎదుర్కొంటున్న వారిలో అత్యధిక సంఖ్యాకులు మహిళలే. పురుషులు కూడా లేకపోలేదు. అయితే వీరి సంఖ్య స్వల్పమే. కాలేజీలో వేధింపులు మొదలుకొని ఆఫీసులో ఇబ్బందులు, ర్యాగింగ్, ప్రేమ పేరిట మానసిక హింస.. ఇలా మహిళలు ఎదుర్కొనే సమస్యలు నానాటికీ పెరిగిపోయాయి. ''పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం గత పదేళ్లుగా కనిపిస్తున్న ట్రెండ్. జీవితం అంటే పదో తరగతి పరీక్ష లేదంటే ఇంటర్మీడియెట్ పరీక్ష మాత్రమే కాదని వారికి చెప్పే వారే కరువైపోయారు..'' అంటారు 'సేవ' వాలంటీర్ జవహర్‌లాల్ నెహ్రూ. ఇటీవలి కాలంలో పరీక్షల సమయంలో విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టేందుకు పోలీసులు సైతం హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తుండడం, భాగ్యనగరంలోని ట్యాంక్‌బండ్ చుట్టూ పోలీసు గస్తీని పెంచడం చూస్తుంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు అంటారాయన. నేటి యువతరం ఏ చిన్న సమస్య వచ్చినా తట్టుకోలేక పోతున్నారని, సమస్యలను ఎదుర్కోవడం ఎలాగో కూడా చిన్నప్పట్నించే తల్లిదండ్రులు తమ పిల్లలకు నేర్పాలంటారు ఆయన. భర్తలతో వచ్చే మనస్పర్థల గురించే ఎక్కువమంది మహిళలు తమ సంస్థను సంప్రదిస్తుంటారని చెబుతారు 'సేవ' వాలంటీర్ మాల. వీరిలో 25-35 ఏళ్ల మధ్య వారే ఎక్కువగా ఉంటారని, ఇప్పుడు చాలా కుటుంబాలలో తాగుడు చిచ్చు పెడుతున్నదని చెప్పారామె. అంతేకాదు, అధిక సంపాదన కోసం రాత్రీ పగలు తపించిపోయే వారు, సాఫ్ట్‌వేర్ సంస్థల్లో విపరీతమైన ఒత్తిడితో కూడిన వాతావరణంలో పని చేసే వారు కూడా మానసిక సమస్యలతో బాధపడుతుంటారని మాల పేర్కొన్నారు. ''మనుషులకు రకరకాల సమస్యలు ఎదురవుతాయి. అన్నీ అందరితో పంచుకోలేరు. కొన్ని ఏ ఒక్కరూ ఆమోదించనివి ఉంటాయి..'' అంటారు 'సేవ' వాలంటీర్ రాజ్ తపాడియా. అలాంటి పరిస్థితుల్లో భరించలేని వేదన, నిస్సహాయతకు గురవుతారు. కొన్నిసార్లు ఎందుకీ జీవితం అన్న ఆలోచనలూ కలుగుతాయి. ఒకోసారి ఆత్మహత్య కూడా చేసుకోవాలని అనిపిస్తుంది. ఇలా మానసికంగా కుంగిపోయే వారికి మేం అండగా నిలిచి, ఆ సమస్యకు ఎన్ని రకాల పరిష్కారాలు ఉన్నాయో సూచిస్తాం. అన్నిటికంటే ముందు మా కౌన్సెలింగ్ ద్వారా వారిని నిరాశా నిస్పృహల నుంచి బయటపడవేస్తామని చెబుతారాయన.

సేవాభావం ఉంటే..

ఇతరుల సమస్యలు వినే ఓపిక, బాధలతో సతమతమయ్యే వారి పట్ల సానుభూతి, మృదువైన మాట తీరు, సమస్యను జాగ్రత్తగా అర్థం చేసుకుని విశ్లేషిస్తూ.. ఆ సమస్య నుంచి బయటపడేందుకు ఎలాంటి మార్గాలు ఉన్నాయో ఓపికగా వివరించే మనస్తత్వం, అన్నిటికంటే ముఖ్యంగా హృదయం నిండుగా సేవాభావం.. ఉన్న వారు 'సేవ'లో వాలంటీర్లుగా చేరవచ్చని చెప్పారు 'సేవ' డైరక్టర్ త్యాగరాజన్. ఇలాంటి వారికి నిపుణులైన శిక్షకులచే మూడు రోజుల శిక్షణను ఇప్పిస్తామని, అనంతరం సీనియర్ కౌన్సెలర్ల పర్యవేక్షణలో మరో ఆర్నెల్లపాటు ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చి జంటనగరాలలోని తమ 'సేవ' కేంద్రాలలో వాలంటీర్లుగా పనిచేసే అవకాశం కల్పిస్తామని చెప్పారు. వీరికి జీతభత్యాలేమీ ఉండవు. ఇది పూర్తిగా స్వచ్ఛందంగా చేసే పని. ప్రస్తుతం హైదరాబాద్‌లో నలభై మంది వాలంటీర్లు పని చేస్తున్నారు. వీరిలో గృహిణులు, ఉద్యోగినులు, విద్యార్థినులు ఉన్నారు. నిమ్స్, గాంధీ వంటి ప్రముఖ ఆసుపత్రుల్లోని మానసిక విభాగాల్లోనూ 'సేవ' వాలంటీర్లు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఎవరు ఏ సమస్యను వివరించినా ఓపికగా వింటాం, సూచనలిస్తాం. సమస్య తీవ్రత ఎక్కువనుకుంటే, ఆ సమస్యకు కౌన్సెలింగ్ కంటే మెడిసిన్స్ అవసరం అనిపిస్తే సంబంధిత నిపుణులను సంప్రదించమని చెబుతామని ఆయన వివరించారు.

'సేవ' సంస్థ కృషి వల్ల ఇప్పటివరకు దాదాపు ఇరవై వేల మంది సాంత్వన పొందారు. ఈ సంస్థకు హైదరాబాద్‌లోని పంజగుట్ట, బల్కంపేట ప్రాంతాల్లో కూడా సలహా కేంద్రాలు ఉన్నాయి. 'సేవ'తో అవసరమున్న వారు 9441778290 ఫోన్ నంబరులోగాని, www.sevacounselingcentre.org ద్వారా గాని సంప్రదించవచ్చు.

• వై.రమేష్‌బాబు

• విశ్లేషణ

ప్రేక్షకులే చిత్రకారులు!

ఐశ్వర్యవంతుల కౌగిలిలో చిత్రకళ తడిసి ముద్దవుతున్నపుడు చిత్రకారులు తమ వంతు కోసం వేచిచూసేవారు. అప్పట్లో అదంతా మంచికా? చెడుకా? అని తర్కించే తీరిక వుండేది కాదు. అప్పుడే ఫైన్‌ఆర్ట్స్ పూర్తి చేసిన పిల్లగాడి నుంచి ప్రముఖ ఆర్టిస్టుల వరకు సృజన సృష్టిలో అందరూ బిజీ బిజీ. ఇక బయట -రియలిస్టిక్, అబ్‌స్ట్రాక్ట్, ఫిగరేటివ్ -ఇలాంటి తేడాలేవీ తెలియకపోయినా నక్షత్రహోటల్స్‌లో పేజ్‌త్రీ జనాలు షీవాజ్ రీగల్‌ను చప్పరిస్తూ వేలంపాటలో వుంచిన చిత్రాల గురించి చర్చించుకునేవారు. ఆ పరిస్థితిలోనే హైదరాబాద్ నగరంలో గల్లీకో ఆర్ట్‌గ్యాలరీ వెలసింది. కొంతకాలం తరువాత ఈ బూమ్ నుంచి భూమ్మీదకు ఆర్ట్ చేరుకున్నాక అసలు చిత్రకారుల గురించి ఆర్ట్ కలెక్టర్లకు అప్పుడు తెలిసింది. సరైన సమాచారం లేకుండా సాదాసీదా ఆర్టిస్టుల చిత్రాలు కొన్నవారికి రంగు పడింది. నష్టం

పెయింటింగ్ వేస్తున్న విద్యార్థిని వాణి

మిగిలింది. మొత్తానికి ఇదంతా ఆర్టిస్టులకు, ఆర్ట్‌రంగంపై వ్యాపారం చేసిన వారికి భయంకర అనుభవం. కాని ఆ రోజున నేర్చుకున్న పాఠాలను చాలా మంది మరచిపోయారనిపిస్తోంది. ముఖ్యంగా ఆర్ట్ క్యాంప్‌లు, లైవ్ ఆర్ట్‌పేరిట ఎగ్జిబిషన్‌లను రూపకల్పన చేస్తున్న వారు కొత్త తప్పులను చేసుకుంటూ పోతున్నారనిపిస్తోంది. గుండె జబ్బులున్నవారి కోసం నిధి సేకరించడానికి ఉద్దేశించి ఇటీవల చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో నిర్వహించిన 'ఆర్ట్ విత్ హార్ట్' కార్యక్రమం ఆర్ట్ ప్రేమికులకు నిరాశనే మిగిల్చింది. ఇందులో లక్ష్మాగౌడ్, తోట వైకుంఠం, అంజనీ రెడ్డి, ఫవాద్ తంకానత్, లక్ష్మణ్‌ఏలె ...ఇలా ప్రముఖ చిత్రకారులంతా లైవ్ ఆర్ట్‌లో పాల్గొంటారని నిర్వాహకులు ప్రకటించారు. వాళ్లను చూడటం ఇదొక అరుదైన అవకాశంగా భావించి అక్కడకు చేరుకొన్న ఔత్సాహిక కళాకారులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఎందుకంటే వాళ్లే అక్కడ సెలబ్రిటీలుగా మారిపోయారు. అదెలా?

క్యాంప్‌లో చూసి నేర్చుకుందామని వచ్చిన వారు నిర్వాహకుల కోరిక కుంచె పట్టుకున్నారు. దీనికంటే బాధ కలిగించే విషయమేమిటంటే -ఆర్ట్ గ్యాలరీ సిబ్బంది కూడా మేము సైతం అంటూ కాన్వాస్‌పై రంగులు చిందించడం. వీళ్లంతా వేయకూడదని కాదు. ఆర్ట్‌ను అభిమానించే ఎవరైనా ప్రయత్నించవచ్చు. అయితే ఈ క్యాంప్ అసలు లక్ష్యం ఏమిటి? జరుగుతున్నదేమిటి? అన్నదే ప్రశ్న. రావాల్సిన చిత్రకారులు అక్కడికి రాకపోవడానికి కారణం ఎవరు? ఆర్టిస్టులు ఒప్పుకుని రాలేదా? లేక వాళ్లు సరే అనకుండానే లిఖిత పూర్వకంగా అంగీకారం తెలపకుండానే నిర్వాహకులు చిత్రకారుల పేర్లు వేసుకున్నారా? మొత్తానికి వీళ్లంతా వస్తారని, ఆర్ట్ గురించి తెలుసుకోవడానికి ఇదొక అవకాశంగా భావించిన వారు ఏం తెలుసుకున్నారన్నది ఆలోచించాల్సిన విషయం. ఇంకోవైపు ఔత్సాహికులు వేసిన చిత్రాలన్నీ ఏం చేయాలా? అని నిర్వాహకులు ఆలోచిస్తున్నారు. ప్రచారం కోసం కాకుండా ఆర్ట్ కోసం చిత్తశుద్ధితో కార్యక్రమాలను రూపొందిస్తే బాగుండేది.



ఆర్ట్‌ను పరిశీలిస్తున్న నిర్వాహకుడు ప్రీతాపనికర్

ఆ 30 మందిలో ఒక తెలుగమ్మాయి

తక్కెళ్లపాడు తెలుగమ్మాయి కెనడాలో ప్రతిష్టాత్మకమైన అండర్ గ్రాడ్యుయేట్ మెరిట్ స్కాలర్‌షిప్ సంపాదించుకుంది. దీని విలువ 75వేల డాలర్లు. నాలుగేళ్ల కాలంలో ఇస్తారు. దీనికోసం 3000 మంది దరఖాస్తులు పెడితే 30 మందికి లభించింది. ఆ 30 లో రిషిత ఒకరు. రిషిత తల్లిదండ్రులు అప్సాని అనిత, నాగేశ్వరరావులు గుంటూరు జిల్లా తక్కెళ్లపాడుకు చెందినవారు.

ఎంపిక ప్రక్రియలో భాగంగా ప్రాంతీయ, జాతీయ స్థాయిలో వ్యక్తిగత ఇంటర్వ్యూలు ఉంటాయి. వ్యక్తిత్వం, సేవ, నాయకత్వ లక్షణాల ఆధారంగా ఎంపికచేస్తారు. వీటన్నింటితో పాటు చదువులో మార్కులు ఉన్నాయో కూడా చూస్తారు. పదిహేడేళ్ల రిషిత స్కూల్లో బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించడమే కాక స్కూల్ వార్తాపత్రికకు వ్యాసాలు రాస్తుంది. మేయర్ యూత్ అడ్వైజరీ టీంలో కూడా పనిచేస్తూ. . . డిఇసిఎ ప్రొవిన్షియల్ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలుగా ఉంది.

ఈ అండర్ గ్రాడ్యుయేట్ మెరిట్ స్కాలర్‌షిప్‌ను ప్రతి ఏడాది 30మంది హైస్కూల్ గ్రాడ్యుయేట్లకు ఇస్తారు. దీన్ని డబ్ల్యు గార్‌ఫీల్డ్ వెస్టన్ లోరాన్ స్కాలర్‌షిప్ అంటారు.

లోపలి పేజీలో... భాగమతికి ఇదేం గతి!